క్లుప్తంగా

దోమల నివారణకు డ్రైడే పాటించాలి



ఉంగుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

ఉంగుటూరు: ఆరోగ్య నియమాలు పాటించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం ద్వారా దోమలు నివారించవచ్చునని మలేరియా తాడేపల్లిగూడెం సబ్‌యూనిట్ అధికారి లక్ష్మణరావు అన్నారు. మంగళవారం ఉంగుటూరులో దోమల నివారణకు వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. గ్రామ ఆరోగ్య కార్యకర్త ఎస్తేరు, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రలీల, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పత్తేపురం విద్యార్థినుల ప్రతిభ



విజేతలైన విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరిస్తున్న దృశ్యం

నిడమర్రు: కొల్లేరు ప్రాంతమైన పత్తేపురం జెడ్పీస్కూల్లో చదువుతున్న విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ ప్రదర్శించడం అభినందనీయమని ఉప సర్పంచ్ రుద్రరాజు కొండయ్యరాజు అన్నారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వారధి 2024 రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన కె.దివ్య, కె.రిషిత, కె.మహిమ సువర్ణ టీమ్‌ను మంగళవారం గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు. గైడ్ టీచర్ కె.సుబ్బరాజును డీవైఈవో రవీంద్రభారతి, ఎంఈవోలు శేషు, బాలయ్య, గ్రామ పెద్దలు నడింపల్లి భీమరాజు, పత్సమట్ల లచ్చిరాజు, పత్సమట్ల లక్ష్మీపతిరాజు, పత్సమట్ల సత్తిరాజులు, ఎస్ఎంసీ చైర్మన్ దేవి అభినందించారు.

ప్రజా సమస్యలపై నాలుగు వినతులు

దెందులూరు: మండలంలో వివిధ ప్రాంతాల నుంచి నాలుగు ప్రజా సమస్యలపై వినతులు అందాయని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. నాలుగు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆర్ఐ హేమమాలినికి సూచించారు.ఎంపీడీఓ కే.శ్రీదేవి, ఎంఈఓలు ఏపీఎస్‌వీ ప్రసాద్, కే.అన్నమ్మ, వెలుగు ఏపీఎం సురేష్, ఉపాధి ఏపీఓ దశరథ రామ్‌జీ, ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఏఈ సత్యనారాయణ హాజరయ్యారు.

వ్యాధుల నివారణపై ఇంటింటి ప్రచారం



మహిళలకు మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: వర్షాలు, వరదలతోపాటు కాలానుగుణంగా మలేరియా, డెంగీ, అతిసార వ్యాధులు వ్యాపిస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యసిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని చిలకంపాడు, కాశిపాడులో వైద్య సిబ్బంది మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి వ్యాధుల వ్యాప్తి-నివారణపై అవగాహన కల్పించారు.

చిన్నారుల్లో అభ్యసన వైకల్యాలను గుర్తించాలి

గణపవరం: పిల్లలలో అభ్యసన వైకల్యాలు కలిగిన వారిని గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణనివ్వడం ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చవచ్చునని గణపవరం ఎంఈవో పుచ్చల శేషు అన్నారు. మంగళవారం గణపవరం మండలం పిప్పర హైస్కూల్లో భవిత కేంద్రం పిల్లలు, హైస్కూలు పిల్లలతో కలిసి డిస్‌లెక్సియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, సీఆర్పీ, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు (టూటౌన్): ప్రయాణాల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు మంగళవారం రాత్రి అవగాహన కల్పించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్‌శివ కిషోర్, ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ ఆదేశాలపై ఏలూరు పాత బస్టాండులో ఏలూరు-1 టౌన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బందితో కలిసి నిఘా వ్యవస్థ పనితీరును పరిశీలించారు. పాత బస్టాండ్‌లో ఎటువంటి దొంగతనాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. బస్టాండ్‌లో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించినట్టు పోలీసులు తెలిపారు. ఆర్టీసీ అధికారులకు తగిన సూచనలు, సలహాలిచ్చారు.

భారీ వర్షాలు.. పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు

- అల్ప పీడన ప్రభావంతో అధిక వర్షాలు
- విద్యుత్ పరికరాల వినియోగంలో జర భద్రం
- అప్రమత్తతతో ప్రమాదాల నివారణ



భీమడోలులో ప్రధాన విద్యుత్ స్టేషన్



గాలులకు విద్యుత్ తీగలపై పడుతున్న చెట్ల మట్టలు (ఫైల్)



గుబురుగా ఉన్న చెట్లను తాకుతున్న తీగలు

భీమడోలు: వానాకాలం విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉంటాయి. దీనికి తోడుగా తుఫాన్ కారణంగా కురిసే ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలతో మరింత ప్రమాదాలు సంభవిస్తాయి. వర్షాకాలంలో వానలు, గాలులకు చెట్ల కొమ్మలతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగిపోతుంటాయి. విద్యుత్ తీగలు కిందకు జారిపోతాయి. వాటిని నిర్లక్ష్యం చేస్తే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. ఏ మాత్రం ఆదమరిచినా దాని ఫలితం తీవ్రంగా ఉంటుంది. అందుకే ఈ సీజన్‌లో రైతులు, ప్రజలు విద్యుత్ వినియోగంతో జాగ్రత్తలు పాటించాల్సిందే. బోర్ల కింద, కాలువల కింద మోటార్లతో సాగు చేసే రైతాంగం మరింత అప్రమత్తంగా ఉండాలి. అల్పపీడన ప్రభావంతో మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. అనుమతి లేని వ్యక్తులు ఎటువంటి ఫ్యూజులు వేయరాదని, వీధి దీపాలు మార్చడం వంటి చేయకూడదని అధికారులు హెచ్చరిస్తున్నారు. విద్యుత్ తీగలు కిందకు వాలిన నేపథ్యంలో సంబంధిత సిబ్బందికి సమాచారం అందించి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్యలో ఉంటాయి. వాటికి రక్షణ కంచెలు కూడా ఉండవు. పంట పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రైతులు మైనర్ మరమ్మతులు చేపట్టే సమయంలో ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఏబీ స్విచ్ పూర్తిగా నిలిచిపోకపోతే విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

చేయకూడని పనులు

వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలను తాకవద్దని విద్యుత్ శాఖ సిబ్బంది సూచిస్తున్నారు. నీటిలో పడిన విద్యుత్ తీగల జోలికి ఎట్టి పరిస్థితుల్లో వెళ్లవద్దని, భవన నిర్మాణ కార్మికులు పనులు చేసే సమయంలో విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలంటున్నారు. తడి చేతులతో, తడి బట్టలతో విద్యుత్ పరికరాలను ముట్టరాదని, మరమ్మతులు చేయవద్దని సూచిస్తున్నారు. పిల్లలు అందుకునే ఎత్తులో స్విచ్ బోర్డులను ఉంచరాదని, స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మూత్ర విసర్జన చేయవద్దని అంటున్నారు. సొంతంగా ఇంటికి వైరింగ్ చేయడం, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్త వేయడం, అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలను ఎక్కడం, టీవీ, కేబుల్ వైర్లపై బట్టలు ఆరవేయడం వంటివి చేయరాదని హెచ్చరిస్తున్నారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

విద్యుత్ స్తంభంనుంచి వ్యవసాయ మోటార్‌కు మధ్య ఎక్కువ దూరం ఉండకుండా చూసుకోవాలి. మోటార్ పనిచేయని సమయాల్లో చేతితో దానిని తాకరాదు. టెస్టర్‌ను ఉపయోగించి మాత్రమే పరీక్షించాలి. విద్యుత్ స్తంభంనుంచి మోటార్‌కు విద్యు త్ నేరుగా సరఫరాకాకుండా మధ్యలో ఫ్యూజువేయాలి. మోటార్‌వద్ద ఫ్యూజులు, ఇండికేటర్ బల్బులు, స్టార్టర్‌ను ఒక చెక్కపై బిగించుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోని ఇనుప డబ్బాలపై బిగించకూడదు.

విద్యుత్ సరఫరా లోపం ఉంటే మెకానిక్‌తో మరమ్మతులు చేయించుకోవాలి

వర్షం కురుస్తున్నప్పుడు టీవీ, ఫ్రిజ్, కంప్యూటర్ స్విచ్‌లు ఆఫ్ చేయాలి. వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంది. విద్యుత్ సరఫరాలో సమస్యలుంటే సొంతంగా మరమ్మతులు చేసుకోవద్దు. విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించాలి.

సూచనలు పాటించాలి



భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నందున విద్యుత్ శాఖ అప్రమత్తమైంది. వర్షాల కారణంగా తెగిపడిన విద్యుత్ తీగలు, తడిసిన విద్యుత్ స్తంభాలను, విద్యుత్ తీగలపై తెగిపడిన చెట్ల కొమ్మలను ప్రజలు నేరుగా తాకవద్దు. విద్యుత్ పరికరాల వద్ద వీలైనంత వరకు ప్రతి ఒక్కరూ రబ్బరు చెప్పులను వాడాలి. వ్యక్తిగత భద్రతతో పాటు ప్రాణం మరింత ముఖ్యం. విద్యుత్ సమస్యలపై 1912కు లేదా 94409 02926కు ఫోన్ చేసి సమాచారం అందించాలి. తక్షణమే సమస్యలను పరిష్కరిస్తాం.

– కె.గోపాలకృష్ణ, ఏడీఈ, భీమడోలు

గుజరాతీయులను ఆకట్టుకున్న ప్రకృతి వ్యవసాయం



గుండుగొలను వద్ద కుంట గ్రామంలో కషాయం తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న గుజరాత్ బృందం

ఏలూరు రూరల్: జిల్లా రైతాంగం చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు గుజరాత్ రాష్ట్రం ప్రతినిధులను అబ్బురపరిచిందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ బి తాతారావు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం తీరు తెన్నులు, రైతుల ఆలోచనలు, పెట్టుబడి, రాబడి తదితర అంశాలను పరిశీలించేందుకు మంగళవారం గుజరాత్‌కు చెందిన అతాపీ ఫౌండేషన్ సభ్యులు నందిని శ్రీవాత్సవ, చంద్రిక అశోక్, నవీన్‌పటిధర్, కృష్ణసాహు, హార్పాల్, ప్రవీణ్ బికాడియా, బాబు ప్రజాపతితో పాటు ఉత్థాన్ ట్రస్ట్ ప్రతినిధులు హరిగోపన్‌పటేల్, వసుంధర ఫౌండేషన్ సభ్యులు అజాద్ పగడా, దివ్యాన్ జిల్లాలో పర్యటించారని వెల్లడించారు. మొదట బృంద సభ్యులు ఏలూరు పరిసర వెంకటాపురంలో రైతు సాధికార సంస్థ సభ్యులు చేపట్టిన ప్రకృతి వ్యవసాయంతో చేపట్టిన వరి కాంపాక్ట్ బ్లాక్ పరిశీలించారని వివరించారు. అనంతరం దెందులూరు నియోజకవర్గంలోని అమ్మపాలెంలో కొఠారు రంగయ్య సాగు చేస్తున్న ప్రకృతి సాగు పంటలు, గుండుగొలను వద్ద కుంట గ్రామంలో కషాయంతో జీవామృతాల తయారు వివరాలు, తడికలపూడిలో ఇంజనీర్ ప్రసాద్ పంట భూమిలో వాటర్ హార్వెస్టింగ్ విధానాన్ని పరిశీలించిన గుజరాత్ బృందం రైతు కృషిని కొనియాడారని తెలిపారు. మొత్తంగా గుజరాత్ బృందం ప్రకృతి వ్యవసాయంలో జిల్లా రైతుల మెళుకువలు, అనుభవాలను మెచ్చుకున్నారని వివరించారు. బృందం వెంట మెహబూబ్ వలి, వెంకటేష్‌ప్రకాష్, శ్రీనివాస్, యుమయేను ఉన్నారన్నారు.

చేతుల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలో చేతులు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

భీమడోలు: చేతుల పరిశుభ్రత ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని అన్నేవారిగూడెం యూపీ పాఠశాల హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్ అన్నారు. దుద్దేపూడి పంచాయతీ పరిధిలోని అన్నేవారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి, చేతుల పరిశుభ్రత దినోత్సవాలను నిర్వహించారు. తొలుత అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. అనంతరం చేతుల పరిశుభ్రత పట్ల చిన్నారులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో దాసరి చైతన్యకృష్ణకుమార్, వక్తృత్వ పోటీలో లక్ష్మీదీపిక, చిత్రలేఖనంలో చిన్నం ప్రేమామృత, క్విజ్‌లో బాలప్రసన్న, భవానీ విజేతలుగా నిలిచారు. వారికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సామాజిక కార్యకర్త మండే సుధాకర్ కలాం చిత్రపటానికి మాలలు వేసి ఘన నివాళులర్పించారు.

చేతుల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గణపవరం: చేతుల పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని గణపవరం పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ అన్నారు. మంగళవారం ప్రపంచ చేతుల పరిశుభ్రతా దినోత్సవం సందర్భంగా గణపవరంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వద్ద చేతుల పరిశుభ్రతపై అవగాహన సదస్సు, పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.

ధాన్యం కొనుగోలుకు గోనె సంచులు సిద్ధం



భోగాపురంలో వరి క్షేత్రాలను సందర్శించిన జిల్లా వ్యవసాయాధికారి ఎండీ హబీబ్ భాషా

భీమడోలు: సార్వా ధాన్యం విక్రయించే విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని, గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఎండీ హబీబ్ భాషా అన్నారు. గుండుగొలను గ్రామ పంచాయతీ పరిధిలోని భోగాపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. భీమడోలు ఏడీఏ పి.ఉషారాజకుమారి, ఏవో ఎస్‌పీవీ ఉషారాణితో కలిసి ఆయన వరి క్షేత్రాల సందర్శన చేశారు. పంట చేలను పరిశీలించి రైతులకు పలు సూచనలందించారు. అనంతరం భోగాపురం ఆర్‌బీకే వద్ద ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా మాట్లాడుతూ సార్వా ధాన్యం విక్రయించుకునేందుకు రైతులకు నాణ్యమైన గోనె సంచులను అందుబాటులో ఉంచామన్నారు. పశుసంవర్థక శాఖ వైద్యాధికారి హరికృష్ణ పశుసంవర్ధక శాఖ అమలు చేస్తున్న పథకాలను రైతులకు వివరించారు. ఏడీఏ పి.ఉషారాజకుమారి, ఏవో ఎస్‌పీవీ ఉషారాణి, ఆర్‌బీకే, ఉద్యానవన శాఖ, మత్స్యశాఖ, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపర్చాలి



ఫ్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, చిత్రంలో ఎంఈవో భాస్కర్‌కుమార్

భీమడోలు: భవిత విద్యార్థుల నిర్దిష్ట అభ్యసనా నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ వహించాలని భీమడోలు ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో డిస్లెక్సియాపై అవగాహన మాసోత్సవంలో భాగంగా మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దివ్యాంగులైన విద్యార్థుల్లో అభ్యసనా నిరోధకాలను తొలగించేందుకు ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలన్నారు. డిస్లెక్సియా అనే అభ్యసనా సమస్యతో బాధపడే విద్యార్థులుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం అహ్మద్, స్కూల్ అసిస్టెంట్ ముంతాజ్ వలి, రిసోర్స్‌పర్సన్లు దుర్గ, రత్నకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం



భీమడోలులో అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద జోహార్లు అర్పిస్తున్న పి.బ్రహ్మారావు, తదితరులు

భీమడోలు: భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన క్షిపణి పితామహుడు, భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని భీమడోలు సర్కిల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పిల్లి బ్రహ్మారావు అన్నారు. భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం 93వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం భీమడోలు ఫొటోగ్రాఫర్ల యూనియన్ ఆధ్వర్యంలో భీమడోలు సంత మార్కెట్‌వద్ద అబ్దుల్ కలాం, డాగ్యూరే విగ్రహాలకు పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షుడు ద్రాక్షారపు విశ్వనాథం అధ్యక్షత వహించారు. ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బరజాపు రంగారావు, ప్రతినిధులు పీవీఆర్ మూర్తి, డి.డేవిడ్, నాగరాజు, రంగారావు పాల్గొన్నారు.

ఉప్పాకపాడు పాఠశాలలో..

ఉంగుటూరు: అబ్దుల్ కలామ్ దేశానికి అందించిన సేవలు ఆదర్శనీయమని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అల్లు శ్రీను అన్నారు. ఉప్పాకపాడు పాఠశాల వద్ద అబ్దుల్ కలామ్ విగ్రహం వద్ద జయంతి మంగళవారం నిర్వహించారు. హెచ్‌ఎం నక్కా సుధాకర్ టీచరు శ్రీదేవి, మాకా రత్నకుమారి పాల్గొన్నారు.

డాక్టర్ అబ్దుల్ కలాం యువతకు ఆదర్శప్రాయులు

దెందులూరు: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం యువతకు ఆదర్శప్రాయమని దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. మంగళవారం కళాశాలలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 93వ జయంతి నిర్వహించారు. అనంతరం కళాశాల విద్యార్థులు ఆయన జీవిత విశేషాలను వివరించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైభవంగా అమ్మవారి రథయాత్ర



బువ్వనపల్లిలో అమ్మవారి ఊరేగింపు రథాన్ని లాగుతున్న భక్తులు

నిడమర్రు: దసరా ముగింపు ఉత్సవాల్లో భాగంగా బువ్వనపల్లి ఉమా మార్కేండేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న దుర్గామాత రథోత్సవం మంగళవారం కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విచిత్ర వేషధారణలు, బుట్టబొమ్మలు, డీజే బ్యాండ్‌లతో ఈ రథయాత్ర బువ్వనపల్లి సత్యనారాయణపురం నుంచి గణపవరం బొబ్బిలి వంతెన వరకూ సందడిగా నిర్వహించారు. అమ్మవారి రథాన్ని లాగేందుకు అందరూ పోటీ పడ్డారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ అలుమోలు అంతర్వేది ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అంటువ్యాధులపై విస్తృత ప్రచారం

దెందులూరు: స్థానిక నర్సింగ్ కళాశాలలో వ్యక్తిగత పరిశుభ్రత, అంటువ్యాధులపై మంగళవారం నర్సింగ్ విద్యార్థులు అవగాహనతో కూడిన నృత్య ప్రదర్శనలు చేశారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

కలలను సాకారం చేసుకోండి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై వై.సుధాకర్

భీమడోలు: విద్యార్థులంతా కలలు కనండి వాటిని సాకారం చేసుకునేలా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని భీమడోలు ఎస్సై వై.సుధాకర్ అన్నారు. భీమడోలు మాధురి కళాశాలలో మంగళవారం మిస్సైల్ మాన్ ఆఫ్ ఇండియా, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ప్రపంచ విద్యార్థుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్సై వై.సుధాకర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆడపిల్లల భద్రత, ర్యాగింగ్, గుడ్ టచ్-బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.కళాశాల ఇన్‌చార్జి పి.బాలు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్సై మాట్లాడుతూ విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. ఆకతాయిల బెడద నుంచి రక్షించుకునేందుకు ఫోన్ నంబర్ 112ను సంప్రదించాలన్నారు. ప్రిన్సిపాల్స్ అశోక్, కేసరి, భువనేశ్వరి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం

గణపవరం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తానని, ఉపాధ్యాయుల ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటానని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అన్నారు. ఎమ్మెల్సీ షేక్‌సాబ్జి మరణం కారణంగా నిర్వహించనున్న ఈ ఉప ఎన్నికలకు పీడీఎఫ్ అభ్యర్థిగా గోపీమూర్తిని కార్యవర్గం ఏకగ్రీవంగా ఆమోదించడంతో ఆయన ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మంగళవారం గణపవరం మండలంలో ఆయన యూటీఎఫ్ నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్య క్ష, కార్యదర్శులు విజయరామరాజు, రత్నరాజు, నాయకులు పాల్గొన్నారు.

కొలనువాడ ప్రజాప్రతినిధులకు మార్గదర్శకులు

దెందులూరు: చల్లచింతలపూడి మాజీ సర్పంచ్, సంఘ సేవకులు కొలనువాడ సత్యనారాయణరాజు ప్రజాప్రతినిధులందరికీ ఆదర్శప్రాయులని చల్లచింతలపూడి, రామారావుగూడెం మాజీ సర్పంచ్‌లు సింహాద్రి శ్రీమన్నారాయణ, పుల్లా శ్రీనివాసరావు, పేరం ప్రసాద్, అన్నారు. మంగళవారం చల్లచింతలపూడి, తిమ్మన్నగూడెంలో కొలనువాడ సత్యనారాయణరాజు శతజయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి ఆధ్యాత్మిక, విద్యా, వైద్య, సేవా రంగాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెట్ట గ్రామాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఆయనకు నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, దెందులూరు మాజీ ఎంపీపీ కొలనువాడ కృష్ణంరాజు ఉన్నారు.

నేటి నుంచి ప్రైవేటు మద్యం కిక్కు

- 10 రోజులపాటు కొనసాగనున్న తాత్కాలిక లైసెన్స్‌లు
- 26 నుంచి అధికారికంగా దుకాణాలు
- ఉంగుటూరు నియోజకవర్గంలో 21 దుకాణాలు
- కూటమి నేతల సిండికేట్‌లదే హవా



మూతపడిన ప్రభుత్వ వైన్ షాపు

నిడమర్రు: కూటమి సర్కారు తెచ్చిన నూతన మద్యం పాలసీ నేటితో పట్టాలెక్కనుంది. నియోజకవర్గంలోని 21 ప్రైవేటు మద్యం దుకాణాల కోసం 1,035 మంది లక్కును పరీక్షించుకున్నారు. వీరిలో లక్కీడ్రాలో పొందిన 21 మంది ప్రైవేటు లైసెన్స్ దారులు అమ్మకాలకు సిద్ధమవుతున్నారు. వీరందరికీ 16వ తేదీ నుంచి 10 రోజుల పాటు మద్యం అమ్మకాలకు తాత్కాలిక లైసెన్స్‌లు మాత్రమే మంజూరు చేశారు. 26వ తేదీ నుంచి రెండేళ్లపాటు అమ్మకాలు కొనసాగించుకునేలా పర్మినెంట్ లైసెన్సులు మంజూరు చేస్తామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. జాతీయ రహదారులు, ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థలు, దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉన్న ఆలయాల పరిధి తదితర నిబంధల ప్రకారం దుకాణాలు ఉంటేనే పర్మినెంట్ లైసెన్స్‌లు మంజూరు చేస్తామన్నారు.

ప్రైవేట్‌లో సిండికేట్‌లదే హవా

ప్రైవేటు మద్యం దుకాణాల వేలం పారదర్శకంగా జరిగిందని ప్రభుత్వం చెపుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం సిండికేట్ ద్వారా వేసిని దరఖాస్తులకే లక్కీడ్రాలో తగిలినట్లు తెలుస్తోంది. ఉంగుటూరు నియోజకవర్గంలో సిండికేట్‌గా 100, 200, 50, 20 వరకూ దరఖాస్తులు వేశారు. ఉంగుటూరు నియోజకవర్గానికి చెందిన వారు ఇతర నియోజకవర్గాల్లోనూ, ఇతర నియోజకవర్గాల్లోని సిండికేట్లు ఉంగుటూరు షాపులకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం సొంత నియోజకవర్గాల వారు ఇప్పటికే ప్రభుత్వం ద్వారా నడుపుతున్న షాపులనే అద్దెకు తీసుకుని వ్యాపారం చేయనున్నారు. ఇతర నియోజకవర్గాల వారు షాపుల కోసం తిరుగుతున్నారు. బుధవారం నుంచే అమ్మకాలు కొనసాగించేలా ముందు ఏదో ఒక షాపు లవు అద్దెకు తీసుకుని అమ్మకాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బెల్ట్ షాపుల కోసం కూటమిలో పోటీ

గ్రామాల్లో బెల్ట్ షాపులు, నైట్ పాయింట్ల కోసం కూటమిలో ఉన్న నాయకులు వారి కార్యకర్తలకే ఇవ్వాలంటూ షాపులు దక్కించుకున్న యజమానులతో మంతనాలు జరుపుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం ఈ బెల్ట్‌షాపుల కోసం పరిచయం ఉన్న సిండికేట్ సభ్యులను అడుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరో వైపు కొంత మంది షాపుల యజమానులు మద్యం అమ్మకాలకు మా షాపు అనుకూలమంటూ సిండికేట్ మెంబర్ల చుట్టూ మంగళవారం ప్రదక్షిణలు చేశారు. మొత్తం మీద నేటి నుంచి మందుబాబులకు ప్రైవేటు కిక్కు ఎక్కించేందుకు కూటమి సర్కారు సిద్ధమైంది.